### విద్యుత్ శాఖ ఏఈగా రవీందర్

తిర్యాణి,ఆగస్టు 21:తిర్యాణి మండల విద్యుత్ శాఖ ఏఈగా రవీందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కొంతకాలంగా ఏఈగా పని చేసిన కవిత ఆసిఫాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో, కౌటాల ఏఈగా పనిచేసిన రవీందర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. దీంతో సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఇక్కడ విద్యుత్ శాఖ సిబ్బంది నిరంజన్, విజయ్, రాంరెడ్డి, కమలాకర్, అరుణ్, కృష్ణ, రాజేందర్ తదితరులున్నారు.

### దొంగతనం కేసులో రెండేళ్ల జైలు

బెల్లంపల్లి, అక్టోబర్ 21 : కాల్‌టెక్స్ కెమికల్ ఆంజనేయ స్వామి ఆలయంలో దొంగతనం చేసిన ఇద్దరు నిందితులకు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్ రెండు సంవత్సరాల శిక్ష విధించినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. 2022 అక్టోబర్ 19న ఆలయంలో దొంగతనం జరిగి గర్భగుడి బీరువాలోని నాలుగు తులాల వెండి కిరీటాలు, 800 నగదు అపహరించుకుపోయినట్లు పూజారి శ్రీరామ్‌భట్ల హరీశ్ శర్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులు మహ్మద్ బద్రుద్దీన్, సయ్యద్ సికిందర్ అలీలను పట్టుకుని విచారించారు. వీరిద్దరిని కోర్టులో ప్రవేశపెట్టి ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జర్జి శిక్ష విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### వైన్స్‌చోరీ కేసులో ఒకరికి ఏడాది..

బెల్లంపల్లి, అక్టోబర్ 21 : పట్టణంలోని చౌడేశ్వరి వద్ద హైటెక్ వైన్ షాపులో దొంగతనం చేసిన గుండేటి రాకేశ్‌కు జూనియర్ సివిల్ కోర్డు జడ్జి ముఖేష్ సోమవారం ఏడాది జైలు శిక్ష విధించినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఈ ఏడాది మార్చి 2న వైన్‌షాపు తాళం పగులకొట్టి రూ.53వేల నగదు, ఏడువేల విలువ జేసే మద్యం బాటిళ్లను దొంగతనం చేసినట్లు గంగాచారి రాజ్‌కుమార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు మహిళా కానిస్టేబుల్ ఆరుగురు సాక్షులను కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

### సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, అక్టోబర్ 21: పునః ప్రారంభమైన పాఠశాల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని రెబ్బెన ఎంఈవో ఎం.వెంకటేశ్వర్, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. మండలంలోని తుంగెడ పంచాయతీ పరిధిలోగల కొత్తగూడ(టి) ప్రాథమిక పాఠశాలను తిరిగి సోమవారం పునఃప్రారంభించారు. ఇక్కడ హెచ్ఎంలు వినయ్‌కుమార్, సత్తయ్య, ఉపాధ్యాయులు లింగయ్య, వనతి, నగేశ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సాయికృష్ణ, భగవాన్, తిరుపతి, జుమ్మిడి అనందరావు, తిరుపతి, సంతోశ్, విలాస్, వెంకటేశ్ ఉన్నారు.

### హామీలు నెరవేర్చాలి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 21: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నెరవేర్చాలని హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీసీసీ నస్పూర్‌లోని యూనియన్ ఆఫీస్ వద్ద వారు మాట్లాడారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు ముగిసి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు హామీలు అమలుచేయలేదన్నారు. కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### జీఎం దంపతులకు సన్మానం

శ్రీరాంపూర్, అక్టోబర్ 21 : శ్రీరాంపూర్ జీఎంగా పనిచేసున్న బీ సంజీవరెడ్డి దంపతులను సోమవారం ఆర్కే 7గనిపై, సేవా సమితి మహిళలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆర్కే 7గనిపై జీఎం సంజీవరెడ్డిని టీబీజీకేఎస్ గని ఇన్‌చార్జి బానోత్ రాజునాయక్ సన్మానించారు. శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, జీఎం సంజీవరెడ్డిని సన్మానించారు. ఇక్కడ ఏజెంట్ రాముడు, గని మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

### జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 21:ప్రజా సమస్యలపై సీపీఎం సమరశీల పోరాటాలు చేస్తుందని, జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 9,10,11న కాగజ్‌నగర్ పట్టణంలో 3వ జిల్లా మహా సభలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్, జిల్లా కార్యదర్శి రాజన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గొడిసెల కార్తీక్, రాజేందర్, శ్రీనివాస్. బక్కన్న ఉన్నారు.

### విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

అన్వేశ్ (ఫైల్)

మందమర్రి,అక్టోబర్ 21: మందమర్రి రెండోజోన్‌కు చెందిన విద్యార్థి జీ సత్య అన్వేశ్(21) విద్యుత్ షాక్‌కు గురై సోమవారం సాయంత్రం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మంచిర్యాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న సత్య అన్వేశ్ సోమవారం సాయంత్రం ఇంట్లో స్నానం చేసి టవల్ తీగపై ఆరవేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని మందమర్రి డిస్పెన్సరీకి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఆర్కేపీ ఏరియా హాసిపటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

### పేకాట స్థావరాల నిర్వాహకుడి అరెస్ట్

కోటపల్లి, అక్టోబర్ 21 : కోటపల్లి మండలం షట్‌పల్లి గ్రామ శివారులో పేకాట స్థావరాలను నిర్వహిస్తున్న షట్‌పల్లి గ్రామానికి చెందిన తాండ్ర పోచంను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. పోచం మార్చి 29న పేకాట స్థావరం నిర్వహిస్తూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వివరించారు. తన ప్రవర్తనలో మార్పు రాకపోగా ఈనెల 2న కూడా పేకాట స్థావరం నిర్వహిస్తూ పోచం పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 21: కాగజ్‌నగర్ డివిజన్‌లోని ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇక్కడ సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 21: ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఇక్కడ పోలీస్ ఉన్నతాధికారులు న్నారు.

### భీమారం ఎస్ఐగా శ్వేత

భీమారం/చెన్నూర్ రూరల్, అక్టోబర్ 21 భీమారం ఎస్ఐగా శ్వేత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన రాములు రామగుండంకు కమిషనరేట్ వీఆర్‌గా బదిలీ కాగా చెన్నూర్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన శ్వేత భీమారం ఎస్ఐ బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. చెన్నూర్ స్టేషన్ సిబ్బంది ఆమెను సన్మానించారు.

### స్విమ్మింగ్‌లో మంచిర్యాల వాసికి గోల్డ్‌మెడల్

నస్పూర్,అక్టోబర్ 21 : మంచిర్యాలకు చెందిన పప్పు నారాయణ ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ నిర్వహించిన 9వ తెలంగాణ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ స్విమ్మింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. నవంబర్ 10న భోపాల్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. నారాయణ సింగరేణి రిటైర్డు కార్మికుడు కాగా ప్రస్తుతం సింగరేణి మందమర్రి స్విమ్మింగ్ పూల్‌కు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

### తాటిచెట్టుపై పిడుగు

జైపూర్, అక్టోబర్ 21: మండలంలోని నర్వ గ్రామ సమీపంలోని ఓ పెట్రోల్ పంపు పక్కనగల తాటిచెట్టుపై సోమవారం సాయంత్రం పిడుగు పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సర్వీస్‌కు సమాచారమిచ్చారు. వెంటనే ఫైర్ సర్వీస్‌తో సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలార్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### ఎస్పీని కలిసిన సీఐ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 21: ఇటీవల పోలీస్ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైమ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీఐ సంపత్‌ను ఆసిఫాబాద్ జిల్లాకి కేటాయించిగా సీఐ సంపత్ సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ సీఐకి పలు సూచనలు చేశారు.

### మహిళలకు చీరెల పంపిణీ

లక్షెట్టిపేట, అక్టోబర్ 21: మండలంలోని తిమ్మాపూర్‌లో ఐకేపీ మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందజేసిన చీరెలను పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నాయకులు పంపిణీ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బియ్యాల తిరుపతి, మాజీ సర్పంచ్ రవి, నాయకులు మహిళలున్నారు.

### ప్రతి మహిళ కూ చీర ఇవ్వాలి

దండేపల్లి (జన్నారం), అక్టోబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం డ్వాక్రా మహిళలకు మాత్రమే చీరెలు పంపిణీ చేస్తూ మహిళలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ చీరెలు అందించాలన్నారు. కార్యక్రమంలోబీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, సింగిల్ విండో చైర్మన్ నాసాని జనార్దన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల్ల భరత్‌కుమార్, నాయకులు తదితరులున్నారు.

### న్యాయం చేయాలని వినతి

కౌటాల, అక్టోబర్ 21 : రైలు ప్రమాదంలో గొర్రెలు, మేకలు కోల్పోయిన జడ భీమయ్యను ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని యాదవ సంఘం మండలాధ్యక్షుడు బట్టమేకల గట్టయ్య సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మస్కూర్ అలీకి వినతి పత్రం అందించారు. మండలంలోని శిర్సా గ్రామానికి చెందిన జడ భీమయ్య గొర్రెలు, మేకలు శనివారం రాత్రి గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందాయన్నారు. ఆయన వెంట యాదవ సంఘం సభ్యులు కడారి భీమయ్య, పోలీ శ్రీశైలం, కొమ్మ పోచయ్య, జడ శ్రీనాథ్‌లున్నారు.

### ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా రంజిత్

జైనూర్ అక్టోబర్ 21 మండల నూతన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా చిక్రం రంజిత్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఈగా పనిచేసిన ఖలీల్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నూతన ఏఈగా రంజిత్‌ను నియమించినట్లు అధికారులు తెలిపారు.

### శ్రీ నరేంద్ర మహారాజ్ జయంతి

కౌటాల, అక్టోబర్ 21 : శ్రీ నరేంద్ర మహారాజ్ 59వ జయంతిని మండలంలోని విర్దండి, గుండాయిపేట గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో మహారాజ్ పల్లకి ఊరేగింపు నిర్వహించారు. అన్నదానం చేశారు.

### హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

నస్పూర్, అక్టోబరు 21 : మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న బోసు సంతోష్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లో హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

# పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్.
- ఘనంగా పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాలు

మందమర్రిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, పోలీసు సిబ్బంది

మందమర్రి, అక్టోబర్ 21: పోలీసు అమర వీరుల త్యాగాలు మరువ లేనవని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అన్నారు. మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమర వీరుల స్తూపం వద్ద ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలతో కలసి ఏసీపీ రవి కుమార్ స్తూపం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు ప్రతి ఏటా అమర వీరుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో వాలీబాల్ కోర్టును ఏసీపీ ప్రారంభించారు.

కౌటాల, అక్టోబర్ 21 : పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా మండలంలో ఎస్ఐ మధుకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ తీశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్ఐ వాలీబాల్ కిట్‌ను అందించారు. అనంతరం ఆయన అమర వీరుల త్యాగాన్ని గుర్తు వివరించారు. ఇక్కడ అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 21: పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సెల్ ఫోన్ వాడకంపై కలిగే నష్టాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సతీశ్, కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 21 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పోలీసులు ఘనంగా నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెన్నూర్ పట్టణ సీఐ కే రవీందర్ అమరవీరులకు నివాళుర్పించారు. ఇక్కడ పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

కాగజ్‌నగర్, అక్టోబర్ 21: కాగజ్ నగర్ పట్టణ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం కాగజ్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో చట్టాలు, ఆయుధాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ తుత్తూరు శంకరయ్య, కాగజ్ నగర్ పట్టణ ఎస్ఐలు ధీకొండ రమేశ్, సుధాకర్, పీఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల, అక్టోబర్ 21 : ఎస్ఐ మధుకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల సేవలను కొనియాడారు. అమర వీరులకు జోహార్లంటూ నినదించారు. ఇక్కడ పోలీసులతోపాటు మండలవాసులున్నారు.

## ఆత్మీయ సమ్మేళనం

వారంతా ఒకప్పుడు కలిసి చదువుకొని 15 ఏళ్ల తర్వాత సోమవారం ఒకే వేదికపై కలిసి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మండలంలోని బూరుగూడ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008, 2009 సంవత్సరంలో కలిసి చదువుకున్న విద్యార్థులందరూ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్ లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి గురువులు సత్యనారాయణ, రమణ, సునీత, సత్యనారాయణను శాలువాతో సన్మానించారు. ఆటాపాటలతో కాలక్షేపం చేసి, మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు.

-ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 21

## అనాథ విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం


పాఠశాల యాజమాన్యానికి ఫీజు అందజేస్తున్న దుర్గం రాజేశ్

మంచిర్యాల టౌన్, అక్టోబర్ 21: దుర్గం పోషం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథ విద్యార్థి చదువుకు అవసరమైన ఫీజు రూ.15 వేలను సోమవారం ట్రస్టు చైర్మన్ దుర్గం రాజేశ్ అందజేశారు. అనాథ, నిరుపేద విద్యార్థికి అవసరమైన పాఠశాల ఫీజును రాజేశ్ తండ్రి దుర్గం పోషం జ్ఞాపకార్థం రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విరాళంగా అందించారు. కార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్‌రావు, రెడ్‌క్రాస్ సెక్రటరీ మహేందర్, హెడ్‌మాస్టర్ రాజు, కుటుంబ సభ్యులు దుర్గం శివశంకర్, కుమ్మరి సురేశ్, దుర్గం శ్రీకర్, గొర్రె వైభవ్, సంపత్, సాయి, నరేందర్, కోడి శ్రీనివాస్, పున్నం, ఎలుక సాయి, దుర్గం రాకేశ్, తదితరులున్నారు.

## వృత్తి శిక్షణ కోర్సులతో స్వయం ఉపాధి

మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, అక్టోబర్ 21: సింగరేణి సేవా సమితి ద్వారా ఉచితంగా అందిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీఈఆర్ క్లబ్‌లో సోమవారం వృత్తి శిక్షణ కోర్సులు పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, అతిథిగా హాజరై సర్టిఫికెట్లు అందించి, మాట్లాడారు. మహిళలు ఉచిత శిక్షణలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి బెల్లంపల్లి ఏరియా అధ్యక్షురాలు ఉమారాణి, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశయనరావు, పీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, సీనియర్ సేవా సమితి సభ్యులు సొల్లు లక్ష్మి, కుందారపు శంకరమ్మ, కోమల ఉన్నారు.

## ఘనంగా భీం వర్ధంతి

భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న గ్రామపటేల్ పెందోర్ దంబీరావ్

కెరమెరి, అక్టోబర్ 21: ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం 84వ వర్ధంతిని సాకడ ఎక్స్‌రోడ్‌లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వారోత్సవాల్లో భాగంగా సాకడ నుంచి ఆదివాసీలు డప్పు వాయిద్యాలతో ర్యాలీగా బయలుదేరి వచ్చారు. అనంతరం భీం విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం, గ్రామ పటేల్ పెందోర్ దంబీరావులు భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇక్కడ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనందరావ్, మాజీ సర్పంచులు జల్పత్‌రావ్, సుమిత్రబాయి, ఆదివాసీ నాయకులు రఘునాథ్, రాయిసిడాం జంగు, అనక దేవ్‌రావు, పెందోర్ శ్రీనివాస్, తుకారాం, వినేశ్, చాహకటి శ్యాంరావు, మాలి సంఘం నాయకులు నారాయణ, వాడై సోనేరావ్ పటేల్, తదితరులున్నారు.

## రెస్క్యూ పోటీల విజేతలకు అభినందన

మందమర్రి, అక్టోబర్ 21: సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా జీఎం జీ.దేవేందర్ రెస్క్యూ పోటీల విజేతలను శాలువాలతో సన్మానించి, అభినందించారు. జోనల్ రెస్క్యూ పోటీలలో మందమర్రి ఏరియాకు బెస్ట్ ఇన్ ఫస్ట్ ఎయిడ్, బెస్ట్ సెకండ్ రెస్క్యూ రికవరి, ఓవరాల్ మూడవ బహుమతులు వచ్చాయని జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, రీజియన్ ఇన్‌చార్జి ఎంఆర్ఏ రామ్మోహన్, డీవైపీం మైత్రేయబంధు, టీం కెప్టెన్ గణేశ్ రామన్, రెస్క్యూ సభ్యులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకురాలి మృతికి సంతాపం

స్వరూప(ఫైల్)

మందమర్రి, అక్టోబర్ 21: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నాలుఘుక్ష వార్డు ప్రాణహిత కాలనీకి చెందిన బీఆర్ఎస్ మహిళా విభాగం సీనియర్ నాయకురాలు, కాలనీ మహిళా సమన్వయకర్త బొలిశెట్టి స్వరూప(43) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రవీందర్, ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు స్వరూప మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. స్వరూపకు భర్త, ముగ్గురు కుమారులున్నారు.

### మండల మహిళా అవ్వల్ కమిటీ ఎన్నిక

బెజ్జూర్, అక్టోబర్ 21 : మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో సోమవారం వీటీడీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్సింగ ఓంప్రకాశ్ ఆధ్వర్యంలో మండల మహిళా అవ్వల్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహిళలు పొదుపు, దతితర సంఘటిత ఉండేందుకు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో మండలాధ్యక్షురాలిగా ఏన్క అమృత, గౌరవాధ్యక్షురాలిగా పద్రం పుష్పలత, సుగుణ, ఉపాధ్యక్షురాలిగా ఎలాది యశోద, పొర్తెటి పద్మ, ప్రధాన కార్యదర్శిగా పద్మ, కార్యదర్శులుగా మడావి నిర్మల, మండిగ అమృత, కోశాధికారిగా మమత, ప్రచార కార్యదర్శిగా మడే సత్తక్కతో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

### ఉద్యోగోన్నతి కల్పించాలి

మందమర్రి, అక్టోబర్ 21: సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఐదో గనిలో ఎస్‌డీఎల్ యంత్రాలపై ఐదు నుంచి 10 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గని కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్, నాయకులు సోమిశెట్టి రాజేశం, కందిశ్రీనివాస్, గాండ్ల సంపత్ కుమార్, నాగేశ్వర్ రావు, ప్రేమ్‌లాల్, రాంజేందర్ నాయక్, చందు, భగవాన్ రెడ్డి, సాదుల సంపత్ పాల్గొన్నారు.

### ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 21: మున్సిపల్ కార్మికులకు బకాయి పడ్డ రెండు కోట్లు ఈఎస్ఐ, పీఎఫ్ వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాకు సమస్య పరిష్కరించాలని సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, రమేశ్, భూమయ్య, అశోక్ పాల్గొన్నారు.

### బ్లాంకెట్ల అందజేత

కాగజ్‌నగర్, అక్టోబర్ 21: మండలంలోని రేకులగూడ ప్రజలకు పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా 40 కుటుంబాలకు బ్లాంకెట్లు, రేషన్ సరుకులు కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ మహేందర్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### గంజాయి స్వాధీనం

హాజీపూర్, అక్టోబర్ 21 : మండలంలోని రాపల్లి గ్రామ శివారులో 83 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని రాపల్లి శివారులో గంజాయి సేవిస్త